క్లుప్తంగా

658 మందికి పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరు



పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

కె.కోటపాడు: రూపాయి ఖర్చు లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల భూసర్వేను నిర్వహించినట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ అన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా గరుగుబిల్లిలో గురువారం వీరు రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామ రెవెన్యూలో 1,122 ఎకరాల భూమిని సర్వే చేసి 658 మంది రైతులకు పాస్ పుస్తకాలను అందించినట్లు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బంగారుమెట్ట స్కూల్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంఈవో

బుచ్చెయ్యపేట: విధి నిర్వహణ, విద్యా బోధనపై నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో బి. కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన బంగారుమెట్ట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించగా, 36 మంది విద్యార్థులకు గాను 32 మంది హాజరైనట్లు గుర్తించారు. పలువురికి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. రోజూ మెనూ ప్రకారం భోజనాలు బాగుంటున్నాయని విద్యార్థులు తెలిపారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఎంఈవో సూచించారు.

పురుషోత్తంకు ఘన సత్కారం



పురుషోత్తంను సత్కరిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: రాష్ట్ర శాలివాహన సంఘం కార్పొరేషన్ చైర్మన్ మన్నెపల్లి పురుషోత్తంను వడ్డాదిలో స్థానిక నాయకులు సత్కరించారు. గురువారం వడ్డాది వచ్చిన సందర్భంగా జెడ్పీటీసీ దొండా రాంబాబు, శాలివాహన సంఘం డైరెక్టర్ డి. అర్జున వెంకటరావు, నాయకులు సూర్య ప్రకాష్, సత్తిబాబు, రాము, గోవింద, బాబూరావు, శ్రీనివాసరావు తదితరులు సత్కరించారు. వడ్డాదిలో కుమ్మరులు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

హరిసర్వోత్తమరావుకు ఘన నివాళి



హరిసర్వోత్తమరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి

నర్సీపట్నం: గ్రంథాలయోద్యమ నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి దమయంతి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కె.త్రిమూర్తులరెడ్డి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్ర రాష్ట్రంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు మొట్టమొదటి ఖైదీ కావడం విశేషమన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. విశ్రాంత లైబ్రేరియన్ జి.మురళీకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

గోడ కూల్చివేతపై విచారణ

బుచ్చెయ్యపేట: మండలంలో బంగారుమెట్ట, ఎల్.బి.పురం గ్రామాల మధ్యన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకున్న గోడను ఈవోపీఆర్డీ విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో ఈ గోడ కూల్చివేతను స్థానికులు అడ్డుకున్నారు. దీన్ని కూల్చితే వర్షాకాలంలో గెడ్డ నీరు వచ్చి ఇళ్లు ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఈ గోడ కొంత భాగం కూల్చివేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని స్పందనలో మాజీ సర్పంచ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఈవోపీఆర్డీతోపాటు పంచాయతీ సెక్రటరీ సతీష్ గోడ కూల్చిన ప్రదేశాన్ని పరిశీలించారు. గెడ్డ నీరు గ్రామంలోకి రాకుండా గోడను పునర్నిర్మించాలని స్థానికులు కోరారు.

అందరికీ ఆరోగ్యం

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- వైద్య సేవలకు సిద్ధం కావాలి: ఆర్డీవో జయరాం



నర్సీపట్నం: మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: గ్రామాల్లో శుక్రవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఐదు దశల్లో నిర్వహించాలన్నారు. తొలుత ఏఎన్ఎం, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. వాటి ఆధారంగా ఈ నెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరంలో అవసరమైన వారికి చికిత్స చేయించి మందులు అందజేస్తారన్నారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకుడు బేతిరెడ్డి విజయ్‌కుమార్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు పాల్గొన్నారు.

రోలుగుంట: గ్రామాల్లో శుక్రవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించనున్నట్లు రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి ధనలక్ష్మి తెలిపారు. కొవ్వూరు గ్రామ సచివాలయంలో ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు బృందాలుగా గృహ సందర్శన చేసి కుటుంబ సభ్యులు వివరాలు తెలుసుకుని రోగాలున్న వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అందులో రోగ లక్షణాలు ఉన్నవారికి చికిత్సలు చేసి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. ఎంపీహెచ్ఈవో కృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ కిరణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి ధనలక్ష్మి

కె.కోటపాడు: కుటుంబంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శైలజ తెలిపారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని వలంటీర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో గురువారం ఆమె సమావేశమయ్యారు. ఈ నెల 15 నుంచి గ్రామాల్లో వలంటీర్లు, ఆశా వర్కర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాల వారి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఈ నెల 30 నుంచి ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌పేటలో సమస్యల పరిష్కారానికి చర్యలు

16, 17 వార్డుల పర్యటనలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పట్టణ శివారు పీఎస్‌పేటలో సమస్యలన్నీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భరోసా ఇచ్చారు. చోడవరం పంచాయతీ శివారు పీఎస్‌పేటలో 16, 17 వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా వార్డుల పరిధి ప్రాంతంలో పంట కాలువలు, మురుగు కాలువలు, రోడ్లు, ఇతర సమస్యలను ఆర్యవైశ్యులు, రైతులు, స్థానికులు విప్ ధర్మశ్రీకి విన్నవించారు. వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా మెయిన్ డ్రెయిన్, ఇంటింటి కుళాయిల ఏర్పాటు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు తమ వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వ పథకాలు మంజూరు విషయమై ఆయన దృష్టికి తీసుకురాగా, వీటిపై సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, వార్డు మెంబరు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు పుల్లేటి శ్యామ్‌ప్రసాద్, లక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు, చవితిన బాబూరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

బుచ్చెయ్యపేట: బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ ఎల్లపు విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద కోరారు. గురువారం విజయరామరాజుపేట సచివాలయ పోలీస్ భార్గవి వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరరావు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులతో కలిసి బాల్య వివాహాలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గవరవరంలో కిశోర బాలికలకు అవగాహన

చోడవరం రూరల్: హెచ్ఎం జి.జె.సుందర్‌సింగ్ అధ్యక్షతన గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కిశోర బాలికల అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా హెల్త్ కౌన్సిలర్ దేవి ఉష బాలికలకు తగు ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. హిందీ దివస్ సందర్భంగా హిందీ భాష ప్రాముఖ్యతను హిందీ టీచర్ ఎ.మహాలక్ష్మి వివరించారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు పార్థసారథి

మాకవరపాలెం/నాతవరం/రోలుగుంట/దేవరాపల్లి: అన్ని పాఠశాలల్లోనూ హిందీ దివస్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ గీతాలు, పద్యాలతోపాటు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రాజ్యాంగంలోని 343 ఆర్టికల్ ప్రకారం హిందీ జాతీయ భాషగా స్వీకరించినట్టు వివరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాతవరం మండలం ఎం.బి.పట్నం హైస్కూల్‌లో హిందీ కవుల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎల్.సిహెచ్.పాత్రుడు, హిందీ ఉపాధ్యాయుడు ఎం. పార్థసారథి అవగాహన కల్పించారు. విద్యా కమిటీ చైర్మన్ రాయపురెడ్డి మంగ పాల్గొన్నారు. మాకవరపాలెం మండలం బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయిని కె.మృణాళిని, రోలుగుంట మండలం కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం. ఎస్. మోహన్‌రావు, హిందీ ఉపాధ్యాయిని భార్గవి, దేవరాపల్లి మండలం ఏ. కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వై. స్వర్ణలత, హిందీ ఉపాధ్యాయిని కె.రాజేశ్వరి హిందీ దివస్ విశిష్టత తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు నిబంధనలు తప్పనిసరి

చోడవరం రూరల్: గణేష్ ఉత్సవాల నిర్వహణకు విధిగా నిబంధనలు పాటించాలని చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక పందిర్లు, మండపాల ఏర్పాటుకు ఆయా పోలీసు స్టేషన్ల నుంచి ముందస్తు అనుమతి పొందాలన్నారు. దీని కోసం వినాయక ఉత్సవ కమిటీగా ఐదుగురు లేదా అంతకుమించి సభ్యులు గుర్తింపు కార్డు నకలు కాపీలు జతపరచాలని, ప్రైవేటు, లేదా పంచాయతీ, మున్సిపల్ స్థలాల్లో విగ్రహాలు పెట్టాలనుకుంటే స్థల యజమాని అనుమతి, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి పత్రాలు జతచేయాలన్నారు. విగ్రహం ఎత్తు, బరువు వంటి వివరాలతోపాటు ఏ రోజున నిమజ్జనం చేస్తారో స్పష్టం చేయాలన్నారు. వీటితోపాటు పలు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

తప్పు చేయకపోతే నిరూపించుకోవాలి

వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

గొలుగొండ: స్కిల్ డెవలప్‌మెంటు స్కాంలో మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు అవినీతికి పాల్పడకపోతే కోర్టులో నిరూపించుకోవాలని నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత తెలిపారు. గురువారం గొలుగొండలో వారు మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేస్తే అయ్యన్నపాత్రుడు కుమారుడు, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి విజయ్‌కు మతిభ్రమించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇష్టానుసారంగా దూషిస్తున్నారని, తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగరవేస్తుందని, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, పార్టీ యూత్ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, సర్పంచ్‌లు కసపల్లి బుజ్జి, నల్లబెల్లి శ్రీను, ఎంపీటీసీ బుల్లి ప్రసాద్, ఉప సర్పంచ్ ఎస్. రమేష్ పాల్గొన్నారు.

కోతుల బెడదపై ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న నర్సింహమూర్తి

మాడుగుల రూరల్: కోతుల బారి నుంచి ప్రజలను కాపాడాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి కోరారు. గురువారం ఆయన మాడుగుల గ్రామస్తులతో కలిసి తహసీల్దారు పి.వి.రత్నంకు ఫిర్యాదు చేశారు. స్థానిక మోదమాంబ కాలనీకి చెందిన కొప్పాక ఎరకన్న అనే వృద్ధుడిని గాయపర్చాయని వాపోయారు. ఇళ్లలోకి చొరబడి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు చిందర వందర చేస్తున్నాయన్నారు. కె.జె.పురం, ఘాట్‌రోడ్డు, తాటిపర్తి, సాగరం, సురవరం, దబ్బకుంటు రహదారిలో కోతులు స్వైర విహారం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. పేలూరి నారాయణరావు, పోతురాజు, రమణమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీడికాడ: వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి కుటుంబానికి రూ.10 వేలు అందించినట్లు ఖండివరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన సాలాపు శ్రీను అనారోగ్యంతో మృతి చెందగా, మిగిలిన రూ.90 వేలు అతడి భార్య ఖాతాలో జమ అవుతాయన్నారు. ఎంపీటీసీ గెంజి స్వాతిబాలాజీ, నాయకులు మోసూరి సన్నిబాబు, సుంకర శ్రీను, షేకు సూర్యనారాయణ, సింగంపల్లి ముత్యాలనాయుడు, శ్రీరంరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

మండలంలోని ఖండివరం-16, జైతవరం-11 చొప్పున నూతన పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నేతలు పంపిణీ చేశారు.

వివక్ష లేకుండా పింఛన్ల మంజూరు



మాడుగులలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్



నాతవరం సచివాలయంలో కొత్త పింఛనుదారులతో సర్పంచ్ గొలగాని రాణి

మాడుగుల: పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కొత్తగా 124 మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజరామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో మీనా కుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాతవరం: మండలానికి ఈ నెల 250పైగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, వాటిలో 80 శాతం మంది టీడీపీ వారికే వచ్చాయని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. గురువారం చమ్మచింతలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. సీఎం జగన్ పాలనలో పార్టీలకతీతంగా పింఛన్లు అందుతున్నాయన్నారు. నాతవరం పంచాయతీలో కొత్త పింఛన్లను సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చమ్మచింత సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చౌడువాడకు కొత్తగా 21 పింఛన్లు

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీ అని వివక్ష లేకుండా అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక వర్తింపజేస్తున్నట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తెలిపారు. చౌడువాడ పంచాయతీలో 21 పింఛన్లు మంజూరయ్యాయి. పంచాయతీ శివారు గ్రామం పాచిలవానిపాలెంలో కొత్త పింఛన్లు అందించారు. వలంటీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎ. కొత్తపల్లికి 16 నూతన పింఛన్లు

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో నూతనంగా మంజూరైన 16 పింఛన్లను వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ గురువారం పంపిణీ చేశారు. వీటిని మంజూరు చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.